
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts




వరంగల్ | సంపుటి 2 | సంచిక 91 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శుక్రవారం | 02.10.2026 | పేజీలు : 8


పెండింగ్ లో ఉన్న
2 డీఏ లకు ఆమోదం

- తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి ఆమోదం
- డీఏల పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ. 2,500 కోట్ల భారం



నిత్యం నిఘా, హైదరాబాద్ : దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వారు ఈ సందర్భంగా వివరించారు. రెండు డీఏల వల్ల ప్రభుత్వంపై సుమారు రూ. 2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా .... మిగతా 2 వ పేజీ లో..



లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ : ప్రధాని మోదీ

- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో.... మిగతా 2వ పేజీ లో..

చరిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

- పాతబస్తీలోని చారిత్రక బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న పురాతన బావి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు ప్రారంభం
- నిజాంల కాలంలో ఔషధ గుణాలున్న నీటిని అందించిన బావిగా ప్రత్యేక గుర్తింపు
- వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన



గచ్చిబౌలి హోటల్‌లో వ్యభిచారం గుట్టురట్టు.. పోలీసుల అదుపులో విదేశీ యువతులు

- నిర్వాహకులు, విటుడితో పాటు ముగ్గురు ఉజ్బెక్ యువతులు అరెస్ట్
- విశ్వసనీయ సమాచారంతో హోటల్‌పై పోలీసుల దాడి
- నిందితుల నుంచి నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గచ్చిబౌలి పోలీసులు



'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

- తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్

- 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి
- ఖైరతాబాద్ నియోజక వర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్న సుదర్శన్ రెడ్డి
- సర్ ప్రక్రియను పాడిగించే ఉద్దేశం లేదని స్పష్టీకరణ



ఎర్రవల్లి భూ సర్వే నివేదిక రెడీ..



- 325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల పరిశీలన
- 244 మంది అనుభవదారులకు నోటీసులు
- వెలికట్టలో 118 మందికి నోటీసులు
- వెంకటాపూర్ రైతుల నుంచి అభ్యంతరాలు
- నివేదికపై ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

నిత్యం నిఘా, హైదరాబాద్ : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి భూముల సర్వే నివేదిక సిద్ధమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు చేపట్టిన సర్వేకు సంబంధించిన పూర్తి నివేదికను అధికారులు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి అందజేశారు. ఈ నివేదికను కలెక్టర్ నేడు ప్రభుత్వానికి సమర్పించనున్నారు. నివేదికలో ఏ అంశాలను పొందుపరిచారు? భూములపై ఎలాంటి వివరాలు వెల్లడవుతాయి? అన్నదానిపై ఆసక్తి నెలకొంది. 2

మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

- రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు.... 2



తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి.. లేదంటే హైదరాబాద్ తగలబడిపోతుంది

- దానం నాగేందర్



- హిమాయత్‌నగర్‌లో 20 వేల ఓట్లు తొలగించారని ఆరోపణ
- బీజేపీతో ఈసీ కుమ్మక్కైందంటూ దానం విమర్శలు
- తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ 2
- ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి.. హైకోర్టుకు విజయారెడ్డి..

- ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్‌పై హైకోర్టులో విచారణ
- నోటిఫికేషన్ నిలిపివేయాలని కోరుతూ విజయారెడ్డి పిటిషన్
- దానం నాగేందర్ ఎన్నికపై వేసిన పాత పిటిషన్ పెండింగ్‌లో ఉందని వాదన
- విచారణను మంగళవారానికి వాయిదా వేసిన న్యాయస్థానం



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి కుమార్తె విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.... 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పెండింగ్ లో ఉన్న
2 డీఏ లకు ఆమోదం
- తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి.. పెరిగినట్లు మంత్రులు పేర్కొన్నారు. నిన్న ఒక్కరోజే 19,892 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు వారు వెల్లడించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం నిన్నటితో వర్షాకాలం ముగిసిందని, ఈ ఏడాది సగటున 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఎల్ నినో ప్రభావంపై కేబినెట్ అత్యవసర నివేదికను సిద్ధం చేస్తోందని మంత్రులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 5,800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. వీటితో పాటు 'తెలంగాణ డిజిటల్ మీడియా అండ్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ'కి కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వారు పేర్కొన్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి..
- హైకోర్టుకు విజయారెడ్డి..

మొదటిపేజీ తరువాయి.. విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

గచ్చిబౌలి హోటల్‌లో వ్యభిచారం గుట్టురట్టు..
పోలీసుల అదుపులో విదేశీ యువతులు

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ హోటల్‌ను కేంద్రంగా చేసుకుని విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు గత రాత్రి ఆ హోటల్‌పై దాడి చేసి, నిర్వాహకులతో పాటు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఢిల్లీకి చెందిన నిఖిల్ ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరిస్తూ, రామ్మోహన్ రెడ్డి అనే వ్యక్తితో కలిసి ఈ అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు హోటల్‌పై మెరుపు దాడి నిర్వహించి, నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్ రెడ్డితో పాటు విటుడు హర్షిత్ సింఘానియాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి పోలీసులు రూ. 13,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుబడిన యువతుల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులోనే ఉన్నాయని, వారు కొద్ది రోజుల క్రితమే నగరానికి వచ్చినట్లు తేలింది. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి, ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు
- తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి.. లేదంటే
హైదరాబాద్ తగలబడిపోతుంది : దానం నాగేందర్

మొదటిపేజీ తరువాయి.. నగరంలో ఓట్ల తొలగింపు వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ అంశంపై మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ తన వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ మొత్తం తగలబడిపోతుందని వ్యాఖ్యానించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు బీజేపీతో కుమ్మక్కై పనిచేస్తున్నారని దానం నాగేందర్ ఆరోపించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లోనే సుమారు 20 వేల ఓట్లను ఏకపక్షంగా తొలగించారని పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నాయకులు వ్యవస్థీకృతంగా 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని విమర్శించారు. స్థానికంగా ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. తన నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడే బాధ్యత తనపై ఉందని దానం నాగేందర్ తెలిపారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈసీ స్పందించకపోతే నిరసనలు, ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ
- ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి.. అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేదుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

చరిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

మొదటిపేజీ తరువాయి..

హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది. నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతడి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది. ఒకప్పుడు వంద ఎకరాల్లో విస్తరించిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 4 ఎకరాలకు పరిమితమైంది. దీనిపై దృష్టి సారించిన హైడ్రా, హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం 17 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి చెరువుకు జీవం పోసింది. ఈ చెరువు కింద 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ఘనమైన చరిత్ర ఉంది. మూడవ నిజాం సికందర్ జా పాలనలో (సుమారు 1770) ప్రధాన మంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరు మీదుగా ఈ చెరువును నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.చెరువు పరిసరాల్లోని ఔషధ మొక్కల వేర్ల నుంచి ప్రవహించే నీరు, సహజ సిద్ధంగా వడపోతకు గురై ఈ బావిలోకి చేరేదని, అందువల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలుండేవని చరిత్రకారులు చెబుతారు. ఈ స్వచ్ఛమైన నీటిని నిజాం పాలకులు తాగేవారని, ఎడ్ల బండ్లపై సుదూర ప్రాంతాలకు, చివరకు లండన్‌కు కూడా తరలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ కాలక్రమేణా ఈ బావి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టితో నిండిపోయి తన నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయింది. హైడ్రా ఈ బావి పునరుద్ధరణను కేవలం ఒక కట్టడాన్ని బాగుచేయడంగా కాకుండా వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాల సమన్వయంగా భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక సంపదను తిరిగి ప్రజలకు అందించి, భవిష్యత్ తరాలకు నగర జల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, దాని కింద ఉన్న ఔషధ గుణాల బావి.. ఇవి హైదరాబాద్‌లోని ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు, నీటి సంరక్షణ జ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ పునరుద్ధరణతో ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం జరుగుతోంది.

మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

ఎర్రవల్లి భూ సర్వే నివేదిక రెడీ..

మొదటిపేజీ తరువాయి.. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రవల్లిలో 244 మంది అనుభవదారులకు, వెలికట్టలో 118 మందికి నోటీసులు ఇచ్చారు. అనంతరం ఆయా భూముల్లో క్షేత్రస్థాయిలో హద్దులు, కబ్జాపై ఉన్నవారి వివరాలను పరిశీలించారు. ఎర్రవల్లిలో ఎనిమిది రోజుల పాటు, వెలికట్టలో ఐదు రోజుల పాటు సర్వే కొనసాగింది. ఈ భూముల విషయంలో శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని వారు చెబుతున్నారు. ఇటీవల వెంకటాపూర్ రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ని కలిసి తమ సమస్యను వివరించారు. పాత రికార్డుల ఆధారంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సర్వే నంబర్ 325లో భూములు సాగు చేసుకుంటున్న రైతుల్లోనూ ఆందోళన ఉంది. దశాబ్దాలుగా తమ అధీనంలో ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వారు ఎదురుచూస్తున్నారు. సర్వే సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్కులు, ఇతర పత్రాలను అధికారులకు చూపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మర్కూక్ మండల పరిధిలోని భూములపై లెక్కలు తేల్చాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వే చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పుడు కలెక్టర్ సమర్పించనున్న నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కాటాపురం గ్రంథాలయానికి తాళం.. ప్రయోజనం లేకుండా పోయిందా?

- **విద్యార్థులకు ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని అందుబాటులోకి తేవాలి**
- **ప్రతి మండలంలో కోచింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి: మాజీ ఎంపీటీసీ దానుక నర్సింగరావు**



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్మించిన ప్రభుత్వ గ్రంథాలయం ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని మాజీ ఎంపీటీసీ దానుక నర్సింగరావు విమర్శించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు ఐదారు సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రస్తుతం పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఉన్న గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించి గ్రంథాలయానికి మరమ్మతులు చేయించడంతో పాటు విద్యార్థులకు ఉపయోగపడే పలు ముఖ్యమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గ్రంథాలయ నిర్వహణపై దృష్టి తగ్గిందని ఆరోపించారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వం గ్రంథాలయాలపై చిన్నచూపు చూడటం సరికాదని అన్నారు. కాటాపురం గ్రామంలో అధిక శాతం మంది విద్యావంతులే ఉన్నారని, పలువురు వివిధ ఉద్యోగాల్లో స్థిరపడటంతో పాటు విదేశాల్లోనూ స్థిరపడ్డారని నర్సింగరావు తెలిపారు. విద్యకు ప్రాధాన్యత కల్పించాల్సిన ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచితే వారు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక పలువురు విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జనాభా ప్రాతిపదికన ప్రతి మండలంలో ఒక ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరారు. కాటాపురం ప్రభుత్వ గ్రంథాలయాన్ని పునరుద్ధరించి విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను, గ్రంథాలయ సంస్థ బాధ్యులను నర్సింగరావు కోరారు.

హనుమకొండ జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై దిశా కమిటీ విస్తృత సమీక్ష

- **గత సమావేశ నిర్ణయాల అమలుపై పరిశీలన.. అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం**



హనుమకొండ, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) విస్తృతంగా సమీక్షించింది. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి శాసనసభ్యులు కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. గత ఏడాది మార్చి 7న నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరును యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ఆధారంగా సమీక్షించారు. ఆయా శాఖలు చేపట్టిన చర్యలు, పెండింగ్ అంశాలపై అధికారులు కమిటీకి వివరాలు అందించారు. జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, వైద్యం, రహదారి భద్రత తదితర కీలక రంగాల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డాక్టర్ కడియం కావ్య సూచించారు. అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఆమె పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్ఎస్ క్రీడా పాఠశాలలో పారిశుధ్యం అధ్వానం!

- **చెత్తాచెదారంతో దుర్గంధం.. విద్యార్థుల ఆరోగ్యంపై ఆందోళన**
- **వెంటనే ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని తల్లిదండ్రుల డిమాండ్**



హనుమకొండ,అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎంతో మంది త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జనసేన పార్టీ వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పాలనలో ప్రజాస్వామ్య విలువలను, పట్టభద్రుల హక్కులను పరిరక్షించడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు. పట్టభద్రులు, మేధావులు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. తనకు అవకాశం కల్పించి ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతానని గడల శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

గుర్రం దూకుడుకు.. ఉంగరం చిత్తు!

- **మైత్రి ఆటో యూనియన్ ఎన్నికల్లో 56 ఓట్ల భారీ మెజార్టీతో గడిపెల్లి శ్రీనివాస్ విజయం**
- **మరోసారి అధ్యక్ష బాధ్యతలు.. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ**



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని మైత్రి ఆటో యూనియన్ ఎన్నికల్లో గుర్రం గుర్తుపై పోటీ చేసిన గడిపెల్లి శ్రీనివాస్ విజయం సాధించారు. ఉత్కంఠగా సాగిన ఎన్నికల్లో ప్రత్యర్థిపై 56 ఓట్ల భారీ మెజార్టీ సాధించారు. శ్రీనివాస్ విజయం సాధించడంతో ఆయన మద్దతుదారులు, తోటి ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. గతంలోనూ మైత్రి ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పని చేసిన గడిపెల్లి శ్రీనివాస్ మరోసారి ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అన్ని పార్టీలకు అతీతంగా పోటీ చేసిన ఆయనకు పలువురు ఆటో కార్మికులు మద్దతు పలికారు.

ఆటో కార్మికుల నమ్మకమే నా బలం

విజయం అనంతరం గడిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించిన మైత్రి ఆటో యూనియన్ సభ్యులు, తోటి డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం తన ఒక్కరిదే కాదని, తనకు అండగా నిలిచిన ప్రతి ఆటో కార్మికుడి విజయమని అన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో తనకు మద్దతుగా నిలిచి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

సీనియర్ల సూచనలు ఎంతో కీలకం

తన విజయానికి సీనియర్ డ్రైవర్ల సూచనలు, సలహాలు ఎంతో దోహదపడ్డాయని శ్రీనివాస్ పేర్కొన్నారు. తుంగల శ్రీనివాస్, బొలిశెట్టి శంకర్, పెంటరి రాజు, ఏగోలపు చిన్న సమ్మయ్య గౌడ్ అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం తనకు ఎంతో బలాన్నిచ్చాయని తెలిపారు. సీనియర్ డ్రైవర్ల సలహాలు, తోటి డ్రైవర్ల మద్దతు, ఆటో కార్మికుల నమ్మకంతోనే 56 ఓట్ల మెజార్టీతో విజయం సాధించానన్నారు. మైత్రి ఆటో యూనియన్‌ను మరింత బలోపేతం చేసి సభ్యుల సంక్షేమం కోసం సమష్టిగా పనిచేస్తానని చెప్పారు. గుర్రం గుర్తుపై తనపై విశ్వాసం ఉంచిన ప్రతి ఆటో కార్మికుడి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని గడిపెల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

అండర్ బ్రిడ్జి దుర్గంధంపై గులాబీ పూలతో వినూత్న నిరసన

- **మంచినీటి పైపులైన్ లీకేజీ, డ్రైనేజీ నీటితో ఇబ్బందులు**
- **అధికారులు అలసత్వం వీడి సమస్య పరిష్కరించాలి: మేరుగు అశోక్**



వరంగల్,అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): శివనగర్ 35వ డివిజన్‌లోని అండర్ బ్రిడ్జి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ, డ్రైనేజీ నీరు, చేపలు కడిగిన వ్యర్థ నీరు చేరి బురద, దుర్గంధం ఏర్పడటాన్ని నిరసిస్తూ 35వ డివిజన్ పోటీ కార్పొరేటర్ అభ్యర్థి మేరుగు అశోక్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. అండర్ బ్రిడ్జి వద్ద గులాబీ పూలు చల్లి అధికారుల తీరును నిరసించారు. ఈ సందర్భంగా మేరుగు అశోక్ మాట్లాడుతూ దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుంచి వచ్చే తాగునీటి పైపులైన్ పగిలి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లీకేజీ నీటితో పాటు చేపలు కడిగే నీరు, డ్రైనేజీ నీరు అండర్ బ్రిడ్జి కింద చేరడంతో బురద, దుర్గంధం తీవ్రంగా ఏర్పడుతోందన్నారు. ఇదేనా స్మార్ట్ సిటీ అంటూ అధికారులను ప్రశ్నించారు. పైపులైన్ లీకేజీ కారణంగా గేట్ అవతలి ప్రాంతాల ప్రజలు కలుషిత నీటిని వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా అలసత్వాన్ని వీడి మంచినీటి పైపులైన్ లీకేజీని వెంటనే అరికట్టడంతో పాటు అండర్ బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన బురద, డ్రైనేజీ నీటిని తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో 35వ డివిజన్ పద్మశాలి అధ్యక్షుడు గడ్డం రవి, శివనగర్ నాయకులు పాలేపు శ్రీనివాస్, వెంగళదాస్ కృష్ణ, తోట దేవేందర్, సందేలా రాంబాబు, చింత రాజు, గడ్డం శ్రీనివాస్, బజ్జూరి అంజయ్య, ఆడెపు శ్రీనివాస్, అంకతి అఖిల్, అల్లి ప్రవీణ్, యూసుఫ్, డీకే రాజు, మేకల కార్తీక్, గటిక రాంచందర్, చిన్న, గడ్డం సాయి విక్షిత్, కస్తూరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు

- **చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం.. మృతుల కుటుంబాలకు పరామర్శ**



వరంగల్ జిల్లా / పర్వతగిరి, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండల ప్రథమ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు గురువారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన అత్తి కుమారస్వామిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా నియమించిన సందర్భంగా ఆయన స్వగృహానికి వెళ్లి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పదవికి వన్నె తీసుకురావాలని రాములు ఆకాంక్షించారు. అనంతరం దౌలత్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుడు షేక్ నసీరుద్దీన్ కుటుంబ సభ్యులను మేడిశెట్టి రాములు పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తదుపరి ఇటీవల మృతి చెందిన సివిల్ కానిస్టేబుల్ ఐలపాక అశోక్ తండ్రి ఐలపాక ఐలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గోనె సంపత్, మహమ్మద్ సర్వర్, అంజద్ పాషా, ఎంఆరపల్లి నాయకులు ధర్మయ్య, వెంకన్న, శ్రీనివాస్, మహేష్, ఉప్పసామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక సేవా కేంద్రం

- **బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు.. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు సేవలు**



హనుమకొండ ,అక్టోబర్ 01(నిత్యం నిఘాప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో పట్టభద్రులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, నమోదు సమయంలో ఎదురయ్యే సాంకేతిక, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రం ద్వారా సహకారం అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సేవా కేంద్రం ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. నమోదు ప్రక్రియను పర్యవేక్షించేందుకు జోరిక రమేష్, రామ్మూర్తి, భైరపాక ప్రశాంత్, వినీల్ రావు, వీరస్వామిని ప్రత్యేక బాధ్యతల్లో నియమించినట్లు దాస్యం వినయ్ భాస్కర్ వెల్లడించారు. అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూ రీసర్వే

- రైతుల సమక్షంలో పకడ్బందీగా సర్వే..
  సర్వేయర్లకు సహకరించాలి : అదనపు కలెక్టర్ ఎన్. రవి



హనుమకొండ ,అక్టోబర్ 01(నిత్యం నిఘాప్రతినిధి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియ కొనసాగుతోందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామంలో గురువారం భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎన్. రవి హాజరై రీసర్వే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమక్షంలో భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీసర్వే సందర్భంగా సర్వేయర్లకు సంబంధిత రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూముల వివరాల నమోదు, కొలతల ప్రక్రియలో రైతులు తమ వద్ద ఉన్న సంబంధిత పత్రాలతో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లస్వామి, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ విక్రమ్ కుమార్, డీఐ సారంగపాణి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన పలువురు

- వెంచరామిలో చేరికల కార్యక్రమం.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గండ్ర వెంకట రమణారెడ్డి పిలుపు



భూపాలపల్లి జిల్లా/చిట్యాల ,అక్టోబర్ 01(నిత్యం నిఘా ప్రతినిధి): చిట్యాల మండలం వెంచరామి గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. స్థానిక సర్పంచ్ కాసురమా కుమార్ నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ నాయకత్వంలో రైతులు, ప్రజల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని పలువురు తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆయన అన్నారు. రైతులకు విద్యుత్ సరఫరా, ఎరువుల లభ్యత తదితర అంశాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో ప్రశ్నలు ఉన్నాయని గండ్ర పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనలో చేసిన ప్రసంగాన్ని ప్రస్తావించిన ఆయన, గత ప్రభుత్వంపై విమర్శలకు బదులుగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. రైతులు, మహిళలు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. వెంచరామి నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. చేరిన వారంతా పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జక్కే వెంకటేశం, మోరే ధర్మరాజు, కళ్లెపల్లి సదయ్య, చేటుకూరి అశోక్, గుర్రం అయిలయ్య, యువజన విభాగం ఉపాధ్యక్షుడు తిప్పన శివ, ఆశాడపు మల్లయ్య, పరికిపండ్ల సమ్మయ్య, పరికిపండ్ల సాగర్, పరికిపండ్ల సంతోష్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

నక్కలగుట్టలో గిఫ్ట్ గార్డెన్ ప్రారంభం

- నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన విష్ణు రెడ్డి
- అందుబాటు ధరల్లో నాణ్యమైన బహుమతులు అందించాలని సూచన



హనుమకొండ, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన గిఫ్ట్ గార్డెన్‌ను గురువారం విష్ణు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, వినియోగదారులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బహుమతి వస్తువులను అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, స్థానిక డివిజన్ అధ్యక్షులు కరీం, నాయకులు కొండా నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

దిశా సమావేశంలో అధికారుల తీరుపై ఎంపీ కడియం కావ్య ఆగ్రహం

- సంపూర్ణ సమాచారంతో .. జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలి : ఎంపీ కడియం కావ్య



హనుమకొండ, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): దిశా సమావేశానికి శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో హాజరుకాకపోవడంపై వరంగల్ ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) చైర్మన్ డాక్టర్ కడియం కావ్య అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై దిశా సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ప్రతి శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీ కడియం కావ్య అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ఎన్. రవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్నతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయం, వైద్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, పురావస్తు తదితర శాఖల పరిధిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని ఎంపీ సమీక్షించారు. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పూర్తి సమాచారంతో ఎందుకు రాలేదు?

కొన్ని శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారం లేకుండా అధికారులు సమావేశానికి రావడంపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ శాఖకు సంబంధించిన పథకాల అమలు, పురోగతి, నిధుల వినియోగం, పూర్తయిన పనులు, పెండింగ్ పనులు, సమస్యలు, తదుపరి చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలతో రావాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా దిశా సమావేశానికి హాజరుకావాలని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారి సమావేశానికి హాజరుకాకపోవడంపై కారణాలను లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించారు.

ఎంపీ నిధుల పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కడియం కావ్య అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, పూర్తయిన పనులకు సంబంధించిన చెల్లింపులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాల అమలు తీరును అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, కార్యాలయాలకే పరిమితం కాకుండా పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని అన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు సూచనలు అందించాలని అన్నారు.

గర్భిణీల వివరాలు వంద శాతం నమోదు చేయాలి

వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష సందర్భంగా గర్భిణీల వివరాల నమోదు వంద శాతం ఎందుకు జరగడం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఎంపీ ప్రశ్నించారు. గర్భిణీల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మధుమేహ బాధితులకు అవసరమైన ఇన్సులిన్ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఓపీ విధానంలో అందుతున్న క్యాన్సర్ వైద్య సేవలను మెరుగుపరచడంతో పాటు టీకాల కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలపై చర్యలు

ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బాలల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఎంపీ సూచించారు. బాల్యవివాహాల నిరోధానికి మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ప్రమాద ప్రాంతాలను గుర్తించాలి

జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను రహదారులు, జాతీయ రహదారుల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కడియం కావ్య సూచించారు. ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వరంగల్ మ్యూజియం అభివృద్ధికి ప్రతిపాదనలు

వరంగల్ మ్యూజియం అభివృద్ధికి సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని పురావస్తు శాఖ అధికారులను ఎంపీ ఆదేశించారు. మ్యూజియం అభివృద్ధికి అవసరమైన చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. అధికారుల పనితీరుతోనే ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజలకు చేరుతాయని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే క్షేత్రస్థాయిలో అభివృద్ధి, మార్పు కనిపిస్తుందని డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

టీబీ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ

అనంతరం టీబీ బాధితులకు ఎంపీ కడియం కావ్య పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ హంగులు

- విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషిమంచినీళ్లపల్లి పాఠశాలలో విద్యార్థులకు షూలు పంపిణీ



మల్లంపల్లి, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు అన్నారు. మల్లంపల్లి మండలం మంచినీళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దిలీప్.వి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు షూల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి కొరత లేకుండా ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. బెల్టులు, షూలు తదితర అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా విద్యార్థుల అవసరాలను తీర్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు, ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క ప్రోత్సాహంతో ములుగు జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జిల్లాకు సమీకృత పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం వంటి విద్యా సంస్థలను తీసుకువచ్చి ములుగు జిల్లాను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా స్థానిక ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. అనంతరం వార్డు సభ్యులు పంజాల స్వప్న–సురేష్ దంపతులు పాఠశాల విద్యార్థులకు కుర్చీలను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన వారిని సర్పంచ్ అభినందించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించవచ్చని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొంగరి నరేందర్, గొల్లెన సారంగపాణి, కూచన సురేష్, చెన్నబోయిన మహేందర్, మోసిన్, రవి, పాఠశాల ఉపాధ్యాయులు ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజాసేవే నా రాజకీయం.. ప్రజలే నా బలం

- **32వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం**
- **17,300 మందికి వైద్య పరీక్షలు.. సుమారు 4 వేల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు**

ములుగు జిల్లా,అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లో ముందుకు సాగుతున్నానని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జంపన్న మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా ములుగు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 17,300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించినట్లు చెప్పారు. సుమారు 4 వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని వృద్ధులు, మహిళలు, పేదలు కంటి సమస్యలతో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తన వంతుగా ఈ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలను హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించడంతో పాటు, ఆపరేషన్ అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అండగా నిలుస్తున్నానని చెప్పారు.

రాజకీయం అంటే ప్రజాసేవే

రాజకీయం అంటే ప్రజాసేవేనని జంపన్న పేర్కొన్నారు. గెలిస్తే అసెంబ్లీలో కూర్చోవడం, ఓడిపోతే ఇంట్లో కూర్చోవడం తన రాజకీయ విధానం కాదన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమయంలో తన శక్తి మేరకు అండగా నిలవడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. గత రెండున్నర సంవత్సరాల్లో వైద్యం, విద్య, ఉపాధి, ఆపదలో ఆర్థిక సహాయం తదితర రంగాల్లో సుమారు 20 వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా అండగా నిలిచినట్లు జంపన్న తెలిపారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని చెప్పారు.



జంపన్న పెద్ద కొడుకులా అండగా నిలిచారు

ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా లబ్ధి పొందిన పలువురు పేదలు, వృద్ధులు జంపన్న తమకు పెద్ద కొడుకులా అండగా నిలిచారని పేర్కొన్నారు. కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి హైదరాబాద్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారని తెలిపారు. ఆపరేషన్ల అనంతరం కూడా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ తమ వెంట నిలిచారని చెప్పారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందించినందుకు జీవితాంతం కృతజ్ఞతలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ ప్రజల మధ్యనే ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భూక్య జంపన్న తెలిపారు.

సూర్యుడి వెలుగుతో విద్యుత్ ఖర్చులకు చెక్!

- **ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకంపై అవగాహన**
- **సౌర విద్యుత్‌తో బిల్లుల భారం తగ్గించుకోవాలి: సోలార్ విక్రేత బూడిద సతీష్ యాదవ్**

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి);
గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని విద్యుత్ వినియోగ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సోలార్ విక్రేత బూడిద సతీష్ యాదవ్ ప్రజలకు సూచించారు. మంథని ట్రాన్స్‌కో ఉపవిభాగ కార్యాలయంలో గురువారం సోలార్ విక్రేతల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, వాటి ప్రయోజనాలు, పథకానికి సంబంధించిన వివరాలు, దరఖాస్తు విధానం, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ తదితర అంశాలను ప్రజలకు వివరించారు. సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని, భవిష్యత్తులో గృహ అవసరాలకు కొంతమేర సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుందని సతీష్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేస్తూ సౌర విద్యుత్ వినియోగం వల్ల కలిగే ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలను వివరించారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన సతీష్ యాదవ్

అనంతరం పెద్దపల్లి కలెక్టరేట్‌లో సోలార్ విక్రేత బూడిద సతీష్ యాదవ్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో సౌర విద్యుత్ వినియోగం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు.



వ్యక్తిత్వ వికాసమే అన్ని రంగాల అభివృద్ధికి పునాది

- **విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకోవాలి: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**



హనుమకొండ అక్టోబర్ 01 (నిత్యం నిఘాప్రతినిధి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. వ్యక్తిత్వ వికాసమే విద్య, ఉద్యోగం, సామాజిక సేవతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. గురువారం పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన జాతీయ సేవా పథకం దిశానిర్దేశక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.



జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం ఏర్పడుతుందని అన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడే జాతీయ సేవా పథకం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కమిషనర్ సూచించారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్తులో సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాన్షీరామ్ ఆశయాల సాధనకు బీఎస్పీ సమరభేరి

- **అక్టోబర్ 9న బడంగ్‌పేట్‌లో 'బహుజన రాజ్యాధికార సమరభేరి'.. విజయవంతం చేయాలని ఇబ్రాం శేఖర్ పిలుపు**



జనగామ అక్టోబర్ 01(నిత్యం నిఘాప్రతినిధి): మాన్యవర్ కాన్షీరామ్ ఆశయాల స్ఫూర్తితో బహుజన రాజ్యాధికార సాధన దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న బడంగ్‌పేట్‌లో నిర్వహించనున్న 'బహుజన రాజ్యాధికార సమరభేరి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జనగామ–హైదరాబాద్ రోడ్డులోని విజయ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో సమరభేరి కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇబ్రాం శేఖర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమానికి బహుజనులను సమీకరించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సామాజిక న్యాయం, సమానత్వం, బహుజన సాధికారత అంశాలపై అవగాహన కల్పించడంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా 'హలో బహుజన.. చలో బడంగ్‌పేట్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సామాజిక మార్పు కోసం బహుజనులు రాజకీయంగా చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందని ఇబ్రాం శేఖర్ అన్నారు. కాన్షీరామ్ చూపిన మార్గంలో బహుజనుల ఐక్యతను బలోపేతం చేస్తూ రాజకీయ సాధికారత కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి, రాజకీయ అవగాహన పెంపొందించడం కార్యకర్తల బాధ్యత అని పేర్కొన్నారు. జనగామ జిల్లాలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేసి, సమరభేరి కార్యక్రమానికి ప్రజలను సమీకరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా నాయకుడు జలగం ప్రవీణ్ తెలిపారు. బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు నిర్మాల రత్నం, జిల్లా నాయకులు జేరిపోతుల మల్లయ్య, జలగం ప్రవీణ్, చిలుముల అర్జున్, ఈదునూరి ప్రసాద్, కుమార్ స్వామి, గుర్రం కుమార్ స్వామి, స్వామి, రాంప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉంచొద్దు

- **మూడు రోజులు దాటితే కారణాలు వెల్లడించాలి.. భూ రీసర్వేను వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్ ఎన్. రవి**



హనుమకొండ ,అక్టోబర్ 01(నిత్యం నిఘాప్రతినిధి): తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లను అనవసరంగా పెండింగ్‌లో ఉంచవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో భూముల రిజిస్ట్రేషన్లు, భూ రీసర్వే అంశాలపై అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. రవి మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ కోసం చలానా చెల్లించిన తర్వాత మూడు రోజులకు మించి దరఖాస్తును పెండింగ్‌లో ఉంచితే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ఎందుకు నిలిపివేశారనే విషయాన్ని సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేస్తూ నోటీసు జారీ చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే దరఖాస్తుదారులు ఆర్డీఓలు, అదనపు కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే ఆయా మండలాల పరిధిలో భూ రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సర్వేయర్లతో సమన్వయం చేసుకుంటూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సర్వే సందర్భంగా రైతులకు ఏవైనా సమస్యలు తలెత్తితే వారితో చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్‌తో పాటు జిల్లాలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

- వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై అవగాహన ర్యాలీ..
- జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి: అటవీ అధికారులు



ఏటూరునాగారం ,అక్టోబర్ 01 (నిత్యం నిఘాప్రతినిధి): జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని ఏటూరునాగారం అభయారణ్యం పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అభయారణ్యం పరిధిలోని నాలుగు అటవీ రేంజ్‌ల అధికారులు, సిబ్బంది గురువారం అటవీశాఖ కార్యాలయం నుంచి వై జంక్షన్ కూడలి వరకు పాదయాత్రగా ర్యాలీ చేపట్టారు. వన్యప్రాణులను కాపాడాలని, అడవులను సంరక్షించాలని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అడవులు, వన్యప్రాణుల ప్రాధాన్యతను వివరిస్తూ జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అటవీ రేంజ్ అధికారి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ మొదటి వారంలో దేశవ్యాప్తంగా జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. వన్యప్రాణుల ఆవశ్యకత, అడవుల ప్రాధాన్యత, జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడమే వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అడవులను సంరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రమేష్ అన్నారు. వన్యప్రాణుల రక్షణ, అడవుల పరిరక్షణతో పాటు జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రజలు అటవీశాఖకు సహకరించాలని కోరారు.

వర్ధన్నపేటలో అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం

- 'అంగన్ మిలన్ సేవా' కార్యక్రమంలో చిన్నారులకు పండ్లు, బిస్కెట్ల పంపిణీ



వర్ధన్నపేట ,అక్టోబర్ 01(నిత్యం నిఘా ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో వర్ధన్నపేటలో 'అంగన్ మిలన్ సేవా' కార్యక్రమం నిర్వహించారు. వర్ధన్నపేట మండల కేంద్రంలోని 3, 4వ డివిజన్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య కోసం సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు తదితర పోషకాహారాన్ని పంపిణీ చేశారు. చిన్నారులతో మమేకమైన నాయకులు వారి ఆరోగ్యం, పోషణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ, నర్సంపేట నియోజకవర్గ పోటీ చేసిన అభ్యర్థి కంభంపాటి పుల్లారావు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతి రెడ్డి, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు అడప రాజు, జిల్లా నాయకుడు కొండేటి సత్యం, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మంజుల రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రేణుక, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉష, జిల్లా ప్రధాన కార్యదర్శి శైలశ్రీ, మాజీ కౌన్సిలర్ కొండేటి అనిత, పెద్దూరి రాజు, బీజేవైఎం నాయకులు మహంత్, అనిల్, గిరిప్రసాద్, దేవేందర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో ఘనంగా సాయిబాబా పల్లకి సేవ

- ప్రత్యేక పూజలు, అభిషేకం.. భక్తిశ్రద్ధలతో హారతులు



భద్రాచలం, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): గురువారం సందర్భంగా భద్రాచలంలోని జూనియర్ కళాశాల మైదానంలో కొలువుదీరిన శ్రీ సాయిబాబా మహారాజ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం పూజల్లో భాగంగా ఉదయం మేల్కొలుపు హారతి అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు.మధ్యాహ్నం మహానివేదన సమర్పించిన అనంతరం సాయంత్రం భక్తి శ్రద్ధలతో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక హారతులు అందించినట్లు ఆలయ అర్చకులు శ్రీరామ్ శర్మ తెలిపారు.పల్లకి సేవలో ఆలయ కోశాధికారి వెంకటేశ్వరరావుతో పాటు భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దారికి అడ్డంకుల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి

- నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందించాలి: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



భూపాలపల్లి జిల్లా/ చిట్యాల,అక్టోబర్ 01(నిత్యం నిఘా ప్రతినిధి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి వెళ్లే దారికి సంబంధించిన సమస్యను వెంటనే పరిష్కరించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అధికారులను కోరారు. చిట్యాల మండలం వెంచరామి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, కంకర తదితర నిర్మాణ సామగ్రిని తరలించే దారికి కొంతమంది అడ్డంకులు కల్పించడంతో పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయితే పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. కేవలం దారి సమస్య కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన దారిపై ఎవరైనా అక్రమంగా ఆక్రమణకు పాల్పడినట్లు తేలితే అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై చిట్యాల మండల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, ఇళ్లకు వెళ్లే దారిని పరిశీలించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చొరవతో దారి సమస్యను పరిష్కరించి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని గండ్ర వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు కేటాయించాలి.. కార్మికులకు రూ.6 వేల నెలవారీ పింఛన్ ఇవ్వాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



మహబూబాబాద్ అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. గురువారం భవన నిర్మాణ రంగ కార్యాలయంలో గారే కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్మికుల సమావేశానికి సాదుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక చట్టాలను అమలు చేసేందుకు చర్యలు చేపడుతోందని, దీనివల్ల భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన 1996 చట్టం, సంక్షేమ నిధులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న పథకాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 2009లో సంక్షేమ బోర్డు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 28.50 లక్షల మంది కార్మికులు నమోదు చేసుకోగా, ప్రస్తుతం 15.50 లక్షల మంది కార్డులు మాత్రమే పునరుద్ధరించుకున్నారని తెలిపారు. సుమారు 13 లక్షల మంది కార్మికుల కార్డులు పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సహజ మరణ పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న 54 వేల క్లెయిమ్‌లకు వెంటనే నిధులు కేటాయించాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.6 వేల పింఛన్ అందించాలని కోరారు. ఇళ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సలహాదారు ఆకుల రాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి, ఉపాధ్యక్షుడు కుమ్మరి కుంట్ల నాగన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బానోతు శంకర్ నాయక్, భూక్య సర్వన్, ఎస్‌కే యూసుఫ్, నేరెళ్ల నరసయ్య, వేముల వెంకన్నతో పాటు పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై సమగ్ర విచారణ జరపాలి

- జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచితొలగించాలి.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిలిపివేయాలి: సీపీఎం



ఏటూరునాగారం ,అక్టోబర్ 01 (నిత్యం నిఘాప్రతినిధి): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.డి. దావూద్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా కొనసాగుతున్నట్లు ఎన్నికల సంఘం అధికారిక వివరాలు వెల్లడిస్తున్నాయి. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో దావూద్ పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై స్పష్టత కోసం సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఓటర్ల పేర్లను చేర్చడం, తొలగించడం వంటి అంశాలు నేరుగా ప్రజల ఓటు హక్కుతో ముడిపడి ఉన్నందున ఎన్నికల జాబితాల రూపకల్పనలో పారదర్శకత, నిష్పాక్షికత ఉండాలని దావూద్ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయి ఉంటే వాటిని పరిశీలించి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, సమగ్రతపై ప్రజల్లో విశ్వాసం కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో మరింత పారదర్శకత ఉండేలా చట్టపరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామని దావూద్ తెలిపారు. తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవి, తోలెం కృష్ణయ్య, సురేష్, కోరం చిరంజీవి, కర్నె లాజర్, సంపత్, సమ్మయ్య, నరసింహులు, పూనెం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పేరు కోసం ఉద్యమ బాట

- మామునూరు విమానాశ్రయంపై ప్రజా సంఘాల డిమాండ్



వరంగల్, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): మామునూరులో నిర్మించనున్న విమానాశ్రయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు మాదిగ మాట్లాడుతూ.. అంబేద్కర్ పేరు పెట్టడం ఆయన సేవలకు, సామాజిక న్యాయానికి ఇచ్చే గౌరవమని పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టే అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం పేరు పెట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి భారీ ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ పేరు కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అన్ని ప్రజా సంఘాలతో కలిసి పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల చెన్నయ్య యాదవ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నర్సయ్య మాదిగ, అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా సమన్వయకర్త జంగిలి భాస్కర్ మాదిగతో పాటు పట్టణ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రెడ్ క్రాస్ సేవలకు ఇక మరింత పదును!

- **ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి.. నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు విస్తరించాలి..కొండేటి శ్రీధర్, వన్నాల వెంకటరమణ పిలుపు**
- **రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలి సభ్యుడు డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ కు ఘన సన్మానం**



వరంగల్/వర్ధన్నపేట ,అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): సేవే లక్ష్యం.. సమాజమే బాధ్యతగా ముందుకు సాగాలి! ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందించడంతో పాటు నిరుపేదలకు వైద్య సేవలు, రక్తదానం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఇటీవల వరంగల్ రెడ్‌క్రాస్ సొసైటీ పాలకమండలి సభ్యుడిగా ఎన్నికైన లక్ష్మీ గణపతి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ గజవెల్లి రాజ్‌కుమార్‌ను బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి నూతన బాధ్యతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సేవలు కేవలం కార్యక్రమాలకే పరిమితం కాకుండా.. ఆపదలో ఉన్న ప్రతి నిరుపేదకు చేరేలా కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు. పేదలకు వైద్య సహాయం, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రకృతి విపత్తులు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఆపదలో ఉన్నవారికి రెడ్‌క్రాస్ కనిపించాలి.. అవసరమైన సమయంలో సహాయం అందాలి అని నాయకులు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో మరింత దూకుడు పెంచి, సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ గజవెల్లి రాజ్‌కుమార్ తన వైద్య రంగ అనుభవాన్ని రెడ్‌క్రాస్ సేవలకు అనుసంధానం చేసి సేవా కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి సత్యం, మండల అధ్యక్షుడు అడుప రాజు, బీజేవైఎం నాయకుడు మహంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ శ్రేణులకు చల్లా దిశానిర్దేశం

- **పట్టభద్ర ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..**
  క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలి: చల్లా ధర్మారెడ్డి



హనుమకొండ ,అక్టోబర్ 01(నిత్యం నిఘాప్రతినిధి): వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో పరకాల నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. పట్టభద్రులు, యువత, ఉద్యోగుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని చల్లా ధర్మారెడ్డి సూచించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలను పట్టభద్రులకు వివరించి పార్టీ అభ్యర్థికి మద్దతు కోరాలని అన్నారు. పట్టభద్ర ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన ఓటర్లను కలిసి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామం, పట్టణంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని చల్లా ధర్మారెడ్డి కోరారు. ఎన్నికల కోసం నియోజకవర్గ బాధ్యుడిగా పరకాల మండలానికి చెందిన సీనియర్ నాయకుడు నేతాని శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పరకాల పట్టణంతో పాటు పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం మండలాలు, గ్రేటర్ వరంగల్ 15, 16, 17వ డివిజన్లకు చెందిన నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ఇళ్ల వద్దే ఎస్ఐఆర్ ప్రక్రియ

- **కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాలు తీసుకోవద్దు.. బీఎల్ఓలు ఇంటి వద్దే సేవలు అందించాలి: సీఈఓ సి. సుదర్శన్‌రెడ్డి**



ములుగు జిల్లా , అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్–2026, పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదు అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన దృశ్య సమావేశంలో సీఈఓ పలు సూచనలు చేశారు. ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి సమావేశంలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు స్వీకరించేందుకు, అవసరమైన పత్రాలు సమర్పించేందుకు కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలని ఆదేశించారు. సాధారణంగా ఓటర్లను విచారణ కోసం కార్యాలయాలకు పిలవరాదని, తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించాలని సూచించారు. తెలంగాణలో కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసే సమయంలో ఫారం–6తో పాటు డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని సి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినా, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదుకు ఇది తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం–6, ఫారం–7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. పెండింగ్ నోటీసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల పెండింగ్, పరిష్కార వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి. సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల విభాగం సిబ్బంది సలీం, నితీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ కొరడా

- **కొల్లుగూడెం ర్యాంపు వద్ద రెండు ట్రాక్టర్లు పట్టివేత**



భద్రాచలం, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం–కూనవరం రహదారిలోని కొల్లుగూడెం ఇసుక ర్యాంపు వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ శాఖ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. కొల్లుగూడెం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.అక్రమ ఇసుక తరలింపుపై అధికారులు తనిఖీలు నిర్వహించి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన ఇసుక పరిమాణం, ట్రాక్టర్ల వివరాలు, సంబంధిత వ్యక్తులపై తీసుకోనున్న చర్యలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- **జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం**
- **సీఆర్‌పీఎఫ్ జవాన్లు సహా 59 మంది రక్తదానం**



భద్రాచలం, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఇంజిరాంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 219వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 59 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఆపరేషన్ కౌంటా అధికారి రాజేష్ పాండే, డీఐజీ, ఓపీఎస్ కుంట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. ప్రమాదాల్లో గాయపడినవారితో పాటు తలసేమియా, సికిల్‌సెల్ రక్తహీనత, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమాండెంట్లు ప్రేమ్‌జీత్ కుమార్, విజయ భాస్కర్, పార్థసారథి ఘోష్, విశ్వదీప్, సుధీర్ కుమార్ చౌహాన్, వైద్యాధికారి డాక్టర్ సుప్రియతో పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు శిబిరానికి హాజరై రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి ఆధునిక పరికరాలతో సురక్షితమైన రక్తాన్ని అవసరమైన వారికి అందిస్తూ సేవలందిస్తోందని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ అధికారులను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.ఎస్.ఆర్. చంద్రప్రసాద్, జిల్లా కోశాధికారి టి.వి. బాలయోగి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.బి.జి. తిలక్, ఎం.బి. నర్సారెడ్డి, పల్లంటి దేశప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం–భద్రాచలం రహదారిపై సీపీఎం ఆగ్రహం



భద్రాచలం, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని ఏపీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముంపు మండలాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు సీపీఎం పోలవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్‌సైకిల్ యాత్ర గురువారం భద్రాచలం సరిహద్దుకు చేరుకుంది. భద్రాచలం పట్టణంలోని రాజుపేట వద్ద సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజుపేటలోని మాజీ ఎమ్మెల్యే, అమరజీవి కామ్రేడ్ కుంజ బొజ్జి స్మారక స్తూపానికి వి. శ్రీనివాసరావు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించిన సభలో వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపు ప్రభావానికి గురైన గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడం లేదని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కన్నాయిగూడెం నుంచి భద్రాచలం వరకు రహదారి దుస్థితిని చూస్తే కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థమవుతుందని ఆయన విమర్శించారు. సరిహద్దు గ్రామాల్లో రహదారులు, రవాణా, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఎటపాక–భద్రాచలం సరిహద్దులోని కరకట్ట స్లూయిజ్ మరమ్మతుల విషయంలో రెండు ప్రభుత్వాలు బాధ్యతను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం నుంచి భద్రాచలం పట్టణాన్ని రక్షించేందుకు కరకట్టను పునర్నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై శాస్త్రీయమైన అంచనాలు లేకుండా ప్రాంతాలను విభజించడం వల్ల ప్రస్తుతం అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. భద్రాచలం పట్టణంతో పాటు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ముంపు ముప్పు ఉందని నీటిపారుదల రంగ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ముంపు మండలాల ప్రజల పునరావాసం, మౌలిక వసతులు, సరిహద్దు గ్రామాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకే మోటార్‌సైకిల్ యాత్ర చేపట్టినట్లు వి. శ్రీనివాసరావు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను, స్థానిక సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం, ఏపీ రాష్ట్ర నాయకుడు లోత రామారావు, పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, కార్యదర్శివర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఐ. వెంకటేశ్వర్లు, సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బి. నర్సారెడ్డి, భద్రాచలం గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్‌బాబు, జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగ, ఐలు జిల్లా నాయకుడు ఎం.వి. ప్రసాదరావు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు, డి. సీతాలక్ష్మి , పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, కొలగాని రమేష్, జీవనజ్యోతి, కనకశ్రీ, డి. రాఘవయ్య, అజయ్‌కుమార, కుంజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్‌డీఎఫ్ విద్యార్థినుల ఎంపిక



పర్వతగిరి, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): కల్లెడ ఆర్‌డీఎఫ్ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వరంగల్‌లో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆడేపు జనార్దన్ తెలిపారు.రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో బీపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జి. వెన్నెల, ఎంఫీహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎం. ఉషారాణి ఉన్నారు.విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆడేపు జనార్దన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఏవో సతీష్, అధ్యాపకులు సంతోష్, జయశంకర్, సైదులు, మహేష్, ధాన్య, కిషన్, వేణు, శ్రీలత, గుంశావళి, ధనలక్ష్మి , ప్రవీణ్, తిరుమల మహేష్, ఫిజికల్ డైరెక్టర్ బర్ల రాజు తదితరులు విద్యార్థినులను అభినందించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భూ రీసర్వే

- **రైతుల సమక్షంలో పకడ్బందీగా సర్వే ప్రక్రియసర్వేయర్లకు రైతులు సహకరించాలి: అదనపు కలెక్టర్ ఎన్. రవి**



హనుమకొండ, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకే గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియను చేపడుతున్నామని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామంలో భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన భూ రీసర్వేపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమక్షంలో భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. రీసర్వే సమయంలో సర్వేయర్లకు సంబంధిత రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూముల హద్దులు, కొలతలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా చేయడంలో రీసర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు.భూ రీసర్వే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లస్వామి, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ విక్రమ్ కుమార్, డిఐ సారంగపాణి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో అన్నదానం

- **ప్రథమ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు భోజనం వడ్డించిన కుమారుడు, కోడలు**



వరంగల్/ సంగెం, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): తండ్రి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్ అలీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు రహీముద్దీన్, కోడలు తహారా బేగం దంపతులు ఐనవోలు మండలంలోని కనకదుర్గ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ మహబూబ్ అలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ వృద్ధులకు అన్నదానం చేయడం గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. అన్నదానం నిర్వహించిన రహీముద్దీన్, తహారా బేగం దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌పై రాజకీయ ఫ్లెక్సీల జాతర

- **నిబంధనలు ఉన్నా పట్టించుకోరా..? చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజా సంఘాల డిమాండ్**



ఎల్కతుర్తి, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్న తీరుపై దళిత సంఘాలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో ఏర్పాటు చేసిన సర్కిల్ వద్ద రాజకీయ ప్రచారానికి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం సముచితం కాదని వారు పేర్కొన్నారు.అంబేద్కర్ సర్కిల్ రాజకీయ ప్రచార ఫ్లెక్సీల ఏర్పాటుకు వేదికగా మారడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్కిల్ వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని దళిత, ప్రజా సంఘాల నాయకులు పలుమార్లు సూచించినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని తెలిపారు.ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటుకు సంబంధించి నిబంధనలు ఉంటే వాటిని రాజకీయ పార్టీలు, ప్రజలు అనే తేడా లేకుండా అందరికీ సమానంగా అమలు చేయాలని కోరారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.నిబంధనల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని సమీక్షించాలని కోరారు. రాజకీయ పార్టీ అనే తేడా లేకుండా నిబంధనలు ఉల్లంఘించిన ప్రతి ఒక్కరిపై ఒకే విధమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఇకనైనా అంబేద్కర్ సర్కిల్ వద్ద రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటుపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు కోరారు. అంబేద్కర్ సర్కిల్ గౌరవం, ప్రతిష్ఠను కాపాడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వయోవృద్ధుల అనుభవం.. యువతకు మార్గదర్శకం

- **సీనియర్ సిటిజన్లను ఆదరించాలి: ఘటిక మల్లయ్య**



పర్వతగిరి, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): వయోవృద్ధులను ఆదరించడంతో పాటు వారి అనుభవం, జ్ఞానాన్ని యువత అందిపుచ్చుకొని సమాజ సేవకు అంకితం కావాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఘటిక మల్లయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతనెక్కొండ గ్రామంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్, చింతనెక్కొండ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ శాఖ నిర్వహణ కమిటీ కన్వీనర్ పల్లెపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఘటిక మల్లయ్య మాట్లాడుతూ వయోవృద్ధుల సేవలను, వారి అనుభవాన్ని సమాజం గుర్తించాలని అన్నారు. యువత సీనియర్ సిటిజన్ల నుంచి విలువైన అనుభవాలను నేర్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం మాజీ ఎంపీటీసీ, చౌటపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ పల్లెపాటి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ సంకినేని ధర్మారావు, సీనియర్ సిటిజన్ దబ్బేట రత్నం, చింతనెక్కొండ హితకారిణి సేవా సంఘం శాఖ నిర్వహణ కమిటీ కన్వీనర్ దబ్బేట నరసింహులను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ తరఫున ఘటిక మల్లయ్య సన్మానించారు.కార్యక్రమంలో ఘటిక స్వామి, దబ్బేట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ మార్కెట్ గుమస్తా సంఘం ఎన్నికలకు రంగం సిద్ధం

- **కీలక పదవులకు నామినేషన్లు.. 9న ఎన్నికలు**



వరంగల్ తూర్పు, అక్టోబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ ఏనుమాముల గ్రీన్ మార్కెట్ గుమస్తా సంఘం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గురువారం పలువురు సభ్యులు ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. గ్రీన్ మార్కెట్ గుమస్తా సంఘం కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిటీ సభ్యులు తెలిపారు.సంఘం అధ్యక్ష పదవికి ఇనుముల మల్లేశం, ఉపాధ్యక్ష పదవికి సులగం వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పదవికి బొట్టు వేణుగోపాల్, సహాయ కార్యదర్శి పదవికి దామరకొండ కరుణాకర్, కోశాధికారి పదవికి కోడం సురేందర్ నామినేషన్ పత్రాలను సమర్పించారు.నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు ఎన్నికల కమిటీ తెలిపింది. ఈ నెల 9వ తేదీన ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించింది.గుమస్తా సంఘం సభ్యులందరూ ఎన్నికల కమిటీ నిర్ణయించిన నియమ నిబంధనలను పాటిస్తూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



బండ చెరువులో డ్రోన్‌తో దోమల నివారణ మందుల పిచికారీ



నిత్యం నిఘా, నేరేడ్ మెట్, అక్టోబర్ 1 : మల్కాజిగిరి జోన్ పరిధిలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మౌలాలి సర్కిల్ పరిధిలోని బండ చెరువులో దోమల లార్వా నియంత్రణలో భాగంగా గురువారం డ్రోన్ ద్వారా మందుల పిచికారీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బండ చెరువులో దోమల లార్వా ఉనికిని గుర్తించేందుకు సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. లార్వా వృద్ధికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ నియంత్రణ చర్యలు చేపట్టారు. అనంతరం డ్రోన్ ద్వారా చెరువు విస్తీర్ణంలో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. పెద్ద విస్తీర్ణంలో తక్కువ సమయంలో మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దోమల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చెరువులు, నాలాలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో లార్వా వృద్ధిని ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మల్కాజిగిరి జోన్ పరిధిలో దోమల నియంత్రణ చర్యలను మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.ప్రజలు కూడా తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నియంత్రణకు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని అధికారులు సూచించారు .ఈ కార్యక్రమంలో ఎస్ ఈ లక్ష్మణ్, సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవ్‌రెడ్డి, సూపర్‌వైజర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com